సాక్షి
నిర్మల్
9
బుధవారం । 27 । ఆగస్టు । 2025

గణపతి బప్పా మోరియా



వినాయక పండగ సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మంగళవారం ముందస్తు వేడుకలు నిర్వహించారు. చిన్నారులు మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి పర్యావరణ పరిరక్షణపై సామాజిక చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. మట్టి విగ్రహాలను పూజించాలని పిలుపునిచ్చారు. భైంసా పట్టణంలో శ్రీసరస్వతీ శిశుమందిర్ విద్యార్థులు గణపతి రూపంలో విద్యార్థులు ప్రదర్శన ఏర్పాటు చేసి ఆకట్టుకున్నారు. – భైంసాటౌన్

– వివరాలు 11లో ▸

చెరువుకు మీనం

- మత్స్యకారుల నిరీక్షణకు తెర
- సెప్టెంబర్ ఒకటి వరకు ఆన్‌లైన్ టెండర్ల స్వీకరణ
- రెండే వారంలో జలాశయాల్లోకి పిల్లలు..
- జిల్లాకు 4.26 కోట్ల చేప పిల్లల సరఫరా లక్ష్యం



నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో ఉచిత చేప పిల్లల(సీడ్) పంపిణీపై కొనసాగుతున్న సందిగ్ధం తొలగింది. 2025–26 సంవత్సరానికి టెండర్ ప్రక్రియ ఇటీవల ప్రారంభమైంది. ఈ నెలాఖరు నాటికి టెండర్లు ముగిసి, సెప్టెంబర్ మొదటి లేదా రెండో వారంలో జలాశయాల్లో చేప పిల్లలను విడుదల చేసేందుకు మత్స్యశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 2.37 కోట్ల నుంచి 4.26 కోట్ల సీడ్‌ను చెరువులు, ప్రాజెక్టుల్లో విడుదల చేసే అవకాశం ఉంది.

టెండర్ ప్రక్రియ వివరాలు..

చేప పిల్లల పంపిణీ కోసం ఈ నెల 20 నుంచి ఆన్‌లైన్ టెండర్లను స్వీకరిస్తున్నారు. సెప్టెంబర్ 1న మధ్యాహ్నం 3 గంటల వరకు టెండర్ల స్వీకరణ జరుగుతుంది. అదే రోజు 3:30 గంటలకు జిల్లా స్థాయి కొనుగోలు కమిటీ ఆధ్వర్యంలో టెండర్లను తెరవనున్నారు. టెక్నికల్ ఆమోదం కోసం అనుమతులు, ఫీడ్ కోసం భూమి సర్వే నంబర్లను పరిశీలించి, ఆ తర్వాత ఫీడ్ ఫామ్‌లను భౌతికంగా తనిఖీ చేస్తారు. తక్కువ ధరకు సీడ్ సరఫరా చేసే కాంట్రాక్టర్‌కు బాధ్యతలు అప్పగిస్తారు. 35–40 ఎంఎం సీడ్‌కు రూ.62 పైసలు, 80–100 ఎంఎం సీడ్‌కు రూ.1.65 రేటుగా నిర్ణయించారు.

జిల్లా 222 మత్స్యకార సంఘాలు..

జిల్లాలో 222 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో 13,129 మంది మత్స్యకారులు ఉన్నారు. అదనంగా సుమారు 3,000 మంది చేపలు, రొయ్యల విక్రయంపై ఆధారపడతారు. ఈ కుటుంబాలకు చేపల పెంపకం, విక్రయం ప్రధాన జీవనాధారం. జిల్లాలో స్వర్ణ, గడ్డెన్న వాగు, కడెం, రంగారావు పల్సికర్, ఎస్సారెస్పీ జలాశయాలతో పాటు 552 చెరువులు, కుంటలు ఉన్నాయి. ఈ నీటి వనరుల్లో ఏటా మత్స్యశాఖ సరఫరా చేసే చేపలు, రొయ్యల సీడ్‌ను విడుదల చేసి పెంచుతున్నారు.

ప్రక్రియలో ఆలస్యం..

సాధారణంగా జూలైలో టెండర్లు ఆహ్వానించి, ఆగస్టులో సీడ్ విడుదల చేస్తారు. అయితే, ఈ ఏడాది బడ్జెట్ కేటాయింపులో జాప్యం కారణంగా షెడ్యూల్ వెనుకబడింది. ఈ నెల 18న టెండర్ నోటిఫికేషన్ జారీ చేశారు. సెప్టెంబర్ మొదటి వారంలో కాంట్రాక్టర్ ఖరారై, సీడ్ విడుదలకు సన్నాహాలు పూర్తవుతాయని అధికారులు తెలిపారు.

నగదు బదిలీ డిమాండ్..

ఉచిత చేప పిల్లల నాణ్యత సరిగా లేక నష్టపోతున్నామని మత్స్య సహకార సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. నగదు బదిలీ ద్వారా నిధులను నేరుగా సంఘాల ఖాతాలకు జమ చేస్తే, తామే నాణ్యమైన సీడ్ కొనుగోలు చేసి చెరువుల్లో విడుదల చేస్తామని వారు పేర్కొంటున్నారు. ఈ విధానం నిధుల దుర్వినియోగాన్ని నిరోధిస్తుందని వాదిస్తున్నారు. ప్రభుత్వం సంప్రదాయ టెండర్ పద్ధతినే కొనసాగిస్తోంది. దీంతో కాంట్రాక్టర్ల ద్వారా సరఫరా అయ్యే సీడ్ నాణ్యతపై మత్స్యకారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

టెండర్ ప్రక్రియ ప్రారంభించాం

2025– 26 సంవత్సరానికి చేపల సీడ్ వదిలేందుకు అవసరమైన టెండర్ ప్రక్రియ ప్రారంభించాం. సెప్టెంబర్ 1నాటికి టెండర్ ఓపెన్ చేస్తారు. జిల్లాలో సెప్టెంబర్ మొదటి వారం లేదా రెండో వారంలో చేపల సీడ్ వదిలేలా ఏర్పాట్లు చేస్తున్నాం.

– రాజనర్సయ్య, జిల్లా మత్స్యశాఖ అధికారి

రావయ్యా.. గణపయ్యా..

- వినాయకచవితికి జిల్లా సిద్ధం
- ముస్తాబైన గణేశ్ మండపాలు
- ఈసారీ 'ఏకోదంతుడి'కే జై..



మండపానికి తరలివస్తున్న గణనాథుడు

నిర్మల్: 'రావయ్యా.. బొజ్జగణపయ్యా.. నీరాక మాకెంతో సంతోషమయ్యా..' అంటూ చిన్న నుంచి పెద్దదాకా జిల్లా అంతా గణనాథుడికి స్వాగతం పలుకుతోంది. వినాయకచవితికి పర్వదినంతోపాటు నవరాత్రుల వేడుకలకు అంతా సిద్ధమైంది. ఇంట్లో చిన్ని గణపయ్య మొదలు గల్లీకా గణేశ్ దాకా ఘనంగా స్వాగతం పలికేందుకు మండపాలు, డెకరేషన్‌లు, లైటింగ్, సౌండ్‌సిస్టం.. ఇలా అన్నింటినీ సిద్ధం చేవారు. బుధవారం ఉదయం నుంచే ఏకదంతుడు కొలువుదీరి భక్తుల పూజలందుకోనున్నాడు. కొన్నేళ్లుగా ప్రకృతి పరిరక్షణలో భాగమవుతున్న జిల్లావాసులు ఈసారీ.. 'ఏకోదంతుడి'కే జైకొడుతున్నారు. మట్టిప్రతిమలు, విగ్రహాలకు గతంతో పోలిస్తే డిమాండ్ పెరిగింది. ఒక్క నిర్మల్ పట్టణంలోనే 20కిపైగా పెద్ద మట్టిగణనాథులను ప్రతిష్ఠించారు. ఇక ఇళ్లల్లో దాదాపు మట్టి ప్రతిమలనే పెట్టి పూజిస్తున్నారు. పలు సంఘాలు, సామాజిక కార్యకర్తలూ మట్టి ప్రతిమలను ప్రత్యేకంగా తయారు చేయించి, పండుగ రోజు ఉచితంగా పంచుతున్నారు. మహారాష్ట్ర సాంస్కృతిక ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాలో వినాయక ఉత్సవాలను వంద ఏళ్లకు పైబడి నిర్వహిస్తూ వస్తున్నారు. బాలాగంగాధర్ తిలక్ ఇచ్చిన పిలుపును జిల్లా అలాగే కొనసాగిస్తూ వస్తోంది. ఇప్పటికీ జిల్లాలో చాలా మండపాల వద్ద తిలక్ ఫొటోనూ పెడుతుండటం గమనార్హం. సరిహద్దు మండలాలైన తానూరు, కుభీర్, భైంసాల్లో ఇప్పటికీ పలు గ్రామాలు ఆనవాయితీ ప్రకారం కర్ర గణేశులనే పూజిస్తున్నాయి.

న్యూస్‌రీల్

ఆశ్రమ పాఠశాల ఖాళీ



పిల్లలు లేక బోసిపోయిన పాఠశాల

కుభీర్: కుభీర్‌లోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో రెండు రోజులుగా పిల్లలు లేరు. దీంతో పాఠశాల బోసిపోతోంది. మంగళవారం ఒక్కరు కూడా లేరు. కేవలం సీఆర్టీలు మాత్రమే పాఠశాలలో ఉన్నారు. గత శుక్రవారం పొలాల అమావాస్య కాగా, శనివారం స్థానిక సెలవు ఇచ్చుకున్నారు. పండుగకు ఇళ్లకు వెళ్లిన విద్యార్థులు సోమ, మంగళవారాల్లో ఒక్కరు కూడా రాలేదు. ఈ పాఠశాలలో మూడో తరగతి నుంచి ఏడో తరగతి వరకు కొనసాగుతుంది. 200 మంది విద్యార్థినులు ఉన్నారు. సోమవారం ప్రిన్సిపాల్ సైతం లేరు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు పాఠశాలకు వచ్చారు. ఈ విషయమై డీటీడీవో అంబాజీనాయక్‌ను వివరణ కోరగా పండుగ తర్వాత పిల్లలు పాఠశాలకురాలేదని తెలిపారు. పిల్లలను రప్పించడానికి సీఆర్టీలు గిరిజన తండాలకు వెళ్లారని పేర్కొన్నారు.

ఫిజీషియన్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాములు



డాక్టర్ దామెర రాములు

నిర్మల్ టౌన్: తెలంగాణ రాష్ట్ర ఫిజీయషన్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ వైద్యుడు దామెర రాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన పలువురు వైద్యులు, మెడికల్ సిబ్బంది రాములుకు శుభాకాంక్షలు తెలిపారు.

కదిలి, కాల్వ ఆలయాల హుండీ లెక్కింపు



కాల్వ ఆలయంలో హుండీ లెక్కిస్తున్న భక్తులు

దిలావర్‌పూర్: మండలంలోని అత్యంత ప్రాచీన ప్రాశస్త్యం ఉన్న శ్రీమాతాన్నపూర్ణ కదలి పాపహరేశ్వర, కాల్వ పరిసర అటవీ ప్రాంతంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీలను మంగళవారం అధికారులు లెక్కించారు. శ్రావణ మాసప్రత్యేక పూజల అనంతరం ఈ హుండీలను దేవాదాయ శాఖ అధికారులు లెక్కించారు. కాల్వ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి రూ.4.25 లక్షల ఆదాయం సమకూరింది. శ్రీమాతాన్నపూర్ణ పాపహరేశ్వరాలయానికి హుండీ ద్వారా రూ.6.61 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. ఇందులో కాల్వ ఆలయ కమిటీ చైర్మన్ అంగూరి మహేందర్, కదిలి ఆలయ కమిటీ చైర్మన్ నార్వాడి వెంకట్‌రావుపాటిల్, ఆలయాల ఈవో భూమయ్య, ఎండో మెంట్ సీనియర్ అసిస్టెంట్లు జాదవ్ మాధవరావుపాటిల్, మనోహర్ పాల్గొన్నారు.

అటవీ అధికారి దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ఖానాపూర్: మండలంలోని తర్లపాడు గ్రామంలో పోడు రైతు బోసు భూమన్నకు చెందిన పంటను అటవీ అధికారులు పదేపదే ధ్వంసం చేస్తుండడంతో సీపీఎం ఆధ్వర్యంలో అటవీ అధికారి దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. పట్టణంలోని జీపు అడ్డాలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నూతన్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యుడు నాగలి నర్సయ్య, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతి ఆధ్వర్యంలో ఈ నిరసన చేపట్టారు. అధికారులు పోడు రైతుపై కక్షసాధింపు ఆపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పోడు సాగుదారులందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

భద్రతా లోపాలు ఉండొద్దు

- ట్రాఫిక్ నియంత్రణపై దృష్టిసారించాలి
- సైబర్ క్రైంపై అవగాహన కల్పించాలి
- ఎస్పీ జానకీషర్మిల



మాట్లాడుతున్న ఎస్పీ జానకీషర్మిల, పక్కన ఎస్పీలు

నిర్మల్ టౌన్: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో ఎక్కడా భద్రతాలోపం కనిపించొద్దని ఎస్పీ జానకీషర్మిల్ ఆదేశించారు. వేడుకల ప్రారంభం నుంచి నిమజ్జన శోభాయాత్ర వరకు పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో నెలవారీ నేర సమీక్ష మంగళవారం నిర్వహించారు. జిల్లాలో నేర నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, సైబర్ క్రైం అవగాహన, రోడ్డు ప్రమాద నివారణలపై కీలక సూచనలు చేశారు.

ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి..

పట్టణ ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. రోడ్లపై వాహనాల రద్దీ నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమర్థవంతమైన ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థలను అమలు చేయాలని ఆదేశించారు.

సైబర్ క్రైంపై అవగాహన..

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఎస్పీ ఆదేశించారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో వీడియో కాల్స్ ద్వారా మోసాలకు గురవుతున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలకు గురైన వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని లేదా https://www.cybercrime.gov.in/ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు.

నేరాల నియంత్రణకు కఠిన చర్యలు..

జిల్లాలో నేరాల సంఖ్య తగ్గించేందుకు రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని, వారి కదలికలను ముందస్తుగా గమనించి చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. అత్యాచారం, పోక్సో కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న గ్రేవ్, నాన్–గ్రేవ్, మిస్సింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు..

రోడ్డు ప్రమాదాల నివారణకు ఎక్కువ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించి, అక్కడ సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఎస్పీ సూచించారు. దొంగతనం, ఆస్తి సంబంధిత నేరాలపై నేరస్తుల కదలికలను నిశితంగా పరిశీలించాలన్నారు. అంబీస్ టెక్నాలజీ, చాన్స్ ప్రింట్ వంటి ఆధునిక సాంకేతికతను ఉపయోగించి కేసులను ఛేదించాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పీలు ఉపేంద్రారెడ్డి, అవినాష్‌కుమార్, రాజేశ్‌మీనా, ఇన్‌స్పెక్టర్లు గోవర్ధన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, కృష్ణ, మల్లేశ్, సమ్మయ్య, అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

- జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్‌పర్సన్ రాధిక



మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి రాధిక

మామడ: విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాసంస్థ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి రాధిక అన్నారు. మండలంలోని పొన్కల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతీ విద్యార్థి ఒక లక్ష్యం నిర్ణయించుకుని తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడం ద్వారా బాల్య వివాహాలను అరికట్టవచ్చని తెలిపారు. విద్యార్థులు విద్యను అభ్యసిస్తునే సమాజంలో వస్తున్న మార్పులను గమనిస్తూ చట్టాల గురించి తెలుసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అరవింద్‌కుమార్, విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంసీ.లింగన్న, ప్రధాన కార్యదర్శి రావుల హన్మంత్‌రెడ్డి, ఖానాపూర్ సీడీపీవో నాగలక్ష్మి, ఎంపీడీవో సుశీల్‌రెడ్డి, వైద్యాధికారి స్వాతి, పారా లీగల్ వాలంటీర్స్ జనార్దన్, పోతన్న, రాజేశ్వర్, కిషన్‌రావ్, రాజేశ్వర్, వీడీసీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురువుల సాయం.. సమస్య పరిష్కారం..



ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు ఆరుబయట భోజనం చేస్తారు. జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులు నేలపైనే కూర్చుని భోజనం చేస్తున్నారు. ఈ క్రమంలో ఉపాధ్యాయులంతా కలిసి విద్యార్థుల ఇబ్బంది తొలగించేందుకు ముందుకు వచ్చారు. తలా కొంత నగదు పోగుచేసి విద్యార్థులు సామూహికంగా భోజనం చేసేందుకు అనువుగా ఉండే సీటింగ్ కవర్లను కొనుగోలు చేశారు. మంగళవారం మధ్యాహ్నం భోజన సమయంలో దాదాపు 250 మంది విద్యార్థులు వీటిపై కూర్చుని భోజనం చేశారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

ఉపాధ్యాయుల పదోన్నతులు పూర్తి

నిర్మల్ రూరల్: జిల్లాలో ఉపాధ్యాయుల ప్రమోషన్ల ప్రక్రియ పూర్తయింది. ఎస్జీటీలకు మంగళవారం రాత్రి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి ఉత్తర్వులు జారీ అయ్యాయి. సోమవారం రాత్రంతా ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. పీఎస్ హెచ్‌ఎంలుగా 34 మందికి, స్కూల్ అసిస్టెంట్ గణితం 6, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ 9, సోషల్ స్టడీస్ 17, తెలుగు 5, హిందీ 1, ఇంగ్లిష్ 5 మొత్తం 78 మంది ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ లభించాయి. బుధవారం సెలవు ఉన్నప్పటికీ వీరంతా ఆయా పాఠశాలలో జాయిన్ కావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తీజ్ సంబురం



తీజ్ వేడుకల్లో మహిళలు, యువతులు

కుంటాల: మండలంలోని ఓలా గ్రామపంచాయతీ పరిధిలోని సేవాలాల్ తండాలో మంగళవారం మహిళలు తీజ్ సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. సంప్రదాయ వేషధారణతో పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. అనంతరం గోధుమనారును నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో తండా పెద్దలు శంకర్ నాయక్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ

- కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: మహిళలు విభిన్నరంగాల్లో స్వయం ఉపాధి పొందేలా శిక్షణ అందించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సారంగాపూర్ మండలం చించోలి సమీపంలోని మహిళా ప్రాంగణంలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాలపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. కుట్టుమిషన్, అల్లికలు, టైలరింగ్, బ్యూటీ పార్లర్, పేపర్ బ్యాగ్ తయారీ, ఎంబ్రాయిడరీ, పెయింటింగ్ వంటి రంగాల్లో శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేసి, అధిక సంఖ్యలో మహిళలకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు విజయలక్ష్మి, మోహన్ సింగ్, నరసింహారెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

915 ఎకరాల్లో పంటనష్టం

- 472 మంది రైతుల పంటలు నీట మునక
- పత్తి, వరి రైతులకు అధిక నష్టం
- ప్రాథమికంగా గుర్తించిన వ్యవసాయశాఖ



పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

మొత్తం పంట నష్టం	915
వరి పంట నష్టం	105 ఎకరాలు
పత్తి పంట నష్టం	810 ఎకరాలు
మొత్తం రైతులు	472 మంది

మండలం	వరి పంట	పత్తి పంట
కడెం	75	40
పెంబి	0	700
సారంగాపూర్	30	70

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో ఇటీవల వారం రోజుల పాటు కురిసిన భారీ వర్షాల కారణంగా 915 ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. మూడు మండలాల్లో 472 మంది రైతులు నష్టపోయినట్లు గుర్తించగా, క్షేత్రస్థాయిలో నిర్వహించిన సర్వేలో ఈ వివరాలు సేకరించారు. నిర్మల్, ఖానాపూర్, కడెం నియోజకవర్గాల్లోని సారంగాపూర్, పెంబి, కడెం మండలాల్లో నష్టం ఎక్కువగా నమోదైంది.

పత్తి పంటకు అధిక నష్టం

పంటల్లో పత్తికి అత్యధిక నష్టం వాటిల్లినట్లు తేలింది. మొత్తం 810 ఎకరాల్లో పత్తి పంట నీటమునిగి దెబ్బతింది. ప్రస్తుతం కాయ దశలో ఉన్న ఈ పంటలో అడుగు భాగంలోని కాయలు మునిగి కుళ్లిపోయాయి. మొక్కల ఆకులు ఎరుపు రంగులోకి మారడంతో దిగుబడి గణనీయంగా తగ్గుముఖం పట్టిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని పెంబి మండలంలో 700 ఎకరాల్లో పత్తి పంట నష్టపోయినట్లు నిర్ధారణ అయింది. 107 ఎకరాల్లో వరి పంట కూడా దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు.

ప్రభుత్వానికి నివేదిక..

పంట నష్టంపై ప్రాథమిక నివేదికను వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి సమర్పించారు. పూర్తిస్థాయి సర్వే ద్వారా వివరణాత్మక నష్ట అంచనా చేయనున్నారు. నిబంధనల ప్రకారం, 33 శాతానికి మించి నష్టం జరిగిన పంటలను మాత్రమే నష్టపోయినవిగా గుర్తిస్తారు.

నష్టం అంచనాలు సిద్ధం చేయండి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు, రహదారులు, భవనాలకు అధిక నష్టం వాటిల్లిందని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శాఖల వారీగా అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. వ్యవసాయం, విద్య, విద్యుత్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖలకు సంబంధించిన నష్టం, సర్వే తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చర్చించారు. నష్టంపై ప్రతీశాఖ క్షేత్ర స్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించి అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ నెల 29 లోపు సర్వే పూర్తి చేసి సంబంధిత శాఖల హెచ్‌వోడీలకు నివేదికలు పంపాలన్నారు. సమావేశంలో డీఈవో పి.రామారావు, డీఏవో అంజిప్రసాద్, డీపీవో శ్రీనివాస్, మత్స్యశాఖ అధికారి రాజనర్సయ్య, విద్యుత్, ఆర్‌అండ్‌బీ, నీటిపారుదల, పంచాయతీరాజ్ శాఖల ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూం, కౌంటింగ్ హాల్ పరిశీలన



కళాశాల గదిని పరిశీలిస్తున్న జెడ్పీసీఈవో

ఖానాపూర్: స్థానిక సంస్థల ఎన్నికల ఓట్లు లెక్కించేందుకు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలలో కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. ఈమేరకు ఆయా భవనాలను జెడ్పీ సీఈవో గోవింద్ మంగళవారం పరిశీలించారు. మండల ప్రత్యేక అధికారి జీవరత్నం, ఎంపీడీవో రత్నాకర్‌రావుతో కలిసి పాఠశాల, కళాశాల గదులను పరిశీలించి ఏర్పాట్లపై సూచనలు చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై దృష్టి పెట్టాలి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జెడ్పీ సీఈవో గోవింద్ సూచించారు. పట్టణంలోని ఎంపీపీ కార్యాలయ సమావేశం మందిరంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇల్లు నిర్మించుకునే వారికి ఇసుక, మొరం ఇక్కట్లు లేకుండా చూడాలన్నారు. బేస్మెంట్ లెవెల్ పూర్తయిన వారికి బిల్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భవనాలకు సోలార్ విద్యుత్తు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జీవరత్నం, ఎంపీడీవో రత్నాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన ఫలితాలు సాధించాలి

- ప్రాంతీయ సంయుక్త సంచాలకులు సత్యనారాయణరెడ్డి



సోన్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలిస్తున్న సత్యనారాయణరెడ్డి

సోన్: విద్యార్థులు అభ్యసన ఫలితాలు సాధించేలా బోధించాలని ప్రాంతీయ సంయుక్త సంచాలకులు సత్యనారాయణరెడ్డి అన్నారు. మండలం కేంద్రంలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాలతోపాటు వివిధ పాఠశాలలను డీఈవో రామారావుతో కలిసి మంగళవారం పరిశీలించారు. ప్రాథమిక తరగతుల్లో జరుగుతున్న తొలిమెట్టు కార్యక్రమాలను పరిశీలించారు. విద్యార్థులను అభ్యసన ఫలితాలకు సంబంధిత ప్రశ్నలు అడిగి ప్రగతిని తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతూ.. విద్యార్థుల వివరాలు యూడైస్‌లో నమోదు చేయాలని సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎఫ్ఆర్ఎస్ హాజరు, ఎఫ్ఏ పరీక్ష ఫలితాలు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, వర్క్ బుక్‌లు యూనిఫాంల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం భవిత కేంద్రాన్ని సందర్శించారు. విద్యా సేవలను సీఆర్పీ సంధ్యారాణిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు సహాయ కార్యదర్శి భానుమూర్తి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేకాడుతున్న ముగ్గురి అరెస్ట్

శ్రీరాంపూర్: సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు. మంగళవారం సుందరయ్య కాలనీ వద్ద గల నందనవనం వెనకాల చెట్ల పొదల్లో పేకాడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు అక్కడికి వెళ్లి పేకాడుతున్న ముగ్గురిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వారి నుంచి రూ.64,400 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లక్సెట్టిపేటలో 11మంది..

లక్సెట్టిపేట: మున్సిపాలిటి పరిధిలోని బస్టాండ్ సమీపంలో మంగళవారం సాయంత్రం పేకాడుతున్న 11మందిని పట్టుకున్నట్లు ఎస్సై సురేశ్ తెలిపారు. వారి నుంచి రూ.4,080 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వాహనం ఢీకొని జింకపిల్ల మృతి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 8 గని సమీపంలో రోడ్డు ప్రమాదంలో జింకపిల్ల మృతి చెందింది. మంగళవారం ఉదయం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి ఉంటుందని ఫారెస్ట్ అధికారులు తెలిపారు. ఉదయం గని కార్మికులు ప్రమాదాన్ని చూసి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. డెప్యూటీ రేంజ్ ఆఫీసర్ అజహర్, బీట్ ఆఫీసర్ సౌజన్య ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి దానిని ఖననం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు. జింకపిల్ల వయస్సు మూడేళ్లు ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. రాత్రి వేళ అడవి నుంచి దారి తప్పి ఇటుగా వచ్చి ప్రమాదానికి గురైనట్లు పేర్కొన్నారు.

ప్రమాదంలో ఒకరికి గాయాలు

భైంసాటౌన్: పట్టణంలోని ఆర్టీసీ డిపో సమీపంలో సాత్‌పూల్ వంతెనపై ఆర్టీసీ బస్సు, ఆటో ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. భైంసా డిపోకు చెందిన బస్సు మంగళవారం సాయంత్రం ధర్మాబాద్ వైపు నుంచి భైంసాకు వస్తుండగా, భైంసా వైపు నుంచి వెళ్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో ధ్వంసం కాగా, డ్రైవర్ సంతోష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు ఏరియాస్పత్రికి తరలించగా, క్షతగాత్రున్ని డీఎం హరిప్రసాద్ పరామర్శించారు. ప్రమాద కారణాలు తెలుసుకున్నారు.







‘సరిహద్దు’లో కర్ర గణేశులే..

- సమాజ హితమే వీరి అభిమతం
- ప్రత్యేకత చాటుకుంటున్న ‘పాలజ్’
- నేటి నుంచి నవరాత్రోత్సవాలు


మాటేగాంలో వెలసిన కొరడి గణపతి


పాలజ్‌లోని కర్ర గణేశుడు

భైంసా/తానూరు: గణేశ్ నవరాత్రోవాలను నిర్మల్ జిల్లాలోని తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల ప్రజలు వినూత్న రీతిలో జరుపుకొంటారు. పీవోపీ, మట్టి విగ్రహాలు ఇక్కడ మచ్చుకైనా కనిపించవు. రంగులు, రసాయనాల వినియోగం అస్సలే ఉండదు. హంగులు, ఆర్భాటాలు లేకుండా సమాజహితమే తమ అభిమతమని ఇక్కడి ప్రజలు పూర్వీకులు చూపిన బాటనే నేటికీ అనుసరిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు తమ వంతుగా దోహదం చేస్తున్నారు. కర్రతో చేసిన వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించే ఆనవాయితీని కొనసాగిస్తున్నారు.

పాలజ్ గణేశ్ ఫేమస్

తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులోని ఓ చిన్న మరాఠీ గ్రామం పాలజ్. కుభీర్‌కు పక్కనే మహారాష్ట్రలోని బోకర్ తాలూకాలో ఈ ఊరు ఉంది. స్వాతంత్ర్యానికి పూర్వం ఈ గ్రామంలో కలరా, ప్లేగు వ్యాధులు ప్రబలి జనమంతా మంచం పట్టారు. ఇదే సమయంలో వినాయక చవితి పండుగ వచ్చింది. ఓ వైపు కలరా, ప్లేగు వ్యాధులు, మరోవైపు కరువు పరిస్థితులతో జనం సతమతమయ్యారు. ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా కర్ర గణపతిని చేయించి ప్రతిష్ఠించాలని గ్రామపెద్దలు నిర్ణయించారు. నిర్మల్ కొయ్యబొమ్మలు చేసే నకాషీ కళాకారుడైన గుండాజీ వర్మను కలిశారు. నిష్ఠతో గుండాజీ వర్మ చేసిన సుందరమైన కర్ర విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఊరంతా మొక్కితేనే వ్యాధులు దూరమయ్యాయని, కరువు కాటకాలు తొలగిపోయాయని గ్రామపెద్దలు చెబుతారు. అలా 1948 నుంచి కర్ర గణేశుడిని వినాయక ఉత్సవాల్లో కొలవడం ఆనవాయితీగా వస్తోంది. ఆ ఊరి ఆడబిడ్డల ద్వారానే కర్రగణేశుడి గురించి ఇతర గ్రామాలకు తెలిసింది. పూజల అనంతరం నిమజ్జనం రోజున స్థానిక వాగు వద్దకు తీసుకెళ్లి కర్ర గణేశుడికి పూజలు నిర్వహిస్తారు. అక్కడే నీళ్లు చల్లి తిరిగి ఆలయానికి తీసుకువస్తారు. దీనినే నిమజ్జనోత్సవంగా భావిస్తారు. అనంతరం కర్ర విగ్రహాన్ని తిరిగి ఆలయంలోని బీరువాలో భద్రపరుస్తారు.

కలిసికట్టుగా.. లక్షలాదిగా..

తిరుపతి, షిర్డీలో ఉన్నట్లు పాలజ్‌లోనూ భక్తులకు క్యూలైన్లు ఉన్నాయంటే.. ఇక్కడికి వచ్చే భక్తుల సంఖ్య అంచనా వేయొచ్చు. ప్రతీ ఏడాది వినాయక ఉత్సవాల్లో దాదాపు ఆరు లక్షల నుంచి ఏడు లక్షల మంది భక్తులు పాల్గొంటున్నారని అంచనా. లక్షల్లో తరలివచ్చే భక్తులకు గ్రామస్తులే సేవలందిస్తున్నారు. ఆ ఊరంతా కలిసికట్టుగా కర్రగణేశుడి సేవలో పాల్గొంటుండడం ఇక్కడి విశేషం.

మరికొన్ని గ్రామాల్లోనూ..

తానూరు మండలం బోసిలో వరసిద్ధి కర్ర వినాయకుడు, కుభీర్ మండలం కుభీర్, పార్డి, మాలేగాం చిక్లీ, భైంసా మండలం మాటేగాం, లోకేశ్వరం మండలం అబ్దుల్లాపూర్ గ్రామాల్లోనూ కర్ర గణపతులను ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తారు. స్వాతంత్ర్య పోరాటకాలంలో కరువు నేపథ్యంలో గ్రామస్తుల మొక్కులతో ఇలా ఈ ప్రాంతంలో ఊరంతా కలిసి కర్ర గణపతులను ప్రతిష్ఠించడం మొదలైంది.

పాలజ్‌కు ఎలా వెళ్లాలంటే..

హైదరాబాద్ నుంచి వచ్చేవారు నిజామాబాద్, బాసర మీదుగా భైంసా చేరుకుంటే దూరభారం తగ్గుతుంది. నిర్మల్ మీదుగా వచ్చేవాళ్లు కూడా భైంసా మీదుగానే పాలజ్ వెళ్లాల్సి ఉంటుంది. భైంసా నుంచి 23 కిలోమీటర్ల దూరంలో పాలజ్ ఉంటుంది. ఉత్సవాల సందర్భంగా ఈ గ్రామానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుంది. ప్రైవేట్ వాహనాలు కూడా అందుబాటులో ఉంటాయి.

గణపయ్యకు 32 రూపాలు



హిందూ పురాణాల ప్రకారం గణపతి సకల దేవతలకు అధిపతి. పూజ ఏదైనా ముందుగా గణపతినే పూజిస్తారు. ప్రతీ శుభకార్యాన్ని వినాయకుడి పూజతోనే ప్రారంభిస్తారు. అనాధిగా వస్తున్న సంప్రదాయం నేటికీ కొనసాగుతోంది. హిందూ సంప్రదాయాల్లో ఇంటిని నిర్మిస్తే ప్రధాన ద్వారానికి గణపతిని ప్రతిష్ఠిస్తారు. ఉదయం లేవగానే నీటితో కడిగి పూజించి వెళ్తారు. ఇంటి నుంచి వెళ్లే సమయంలోనూ ప్రధాన ద్వారంలో ఉన్న గణపతికి నమస్కరిస్తారు. తిరిగి వస్తూ మళ్లీ గణపతికి నమస్కరించాకే ఇంటిలోకి వెళ్తారు. ఏ ఆలయం నిర్మించినా ముందుగా గణపతి పూజలు చేస్తారు. గణపతి హోమాలు నిర్వహిస్తారు. ఇలా అందరికీ గణాధిపతి అయిన స్వామివారికి ముద్గల పురాణంలో 32 స్వరూపాలను వర్ణించారు. ఈ 32 స్వరూపాల్లో 16 రూపాలు అత్యంత ప్రాశస్త్యమైనవి.

పురాణాల్లో పేర్కొన్న రూపాలు

పురాణాల్లో వినాయకుడికి 32 స్వరూపాలుగా పేర్కొన్నారు. ఇందులో 16 రూపాలు అత్యంత ప్రాధాన్యమైనమని తెలిపారు. నేటి రోజుల్లో కళాకారులు గణపయ్యను అనేక రూపాల్లో మలుస్తున్నారు. ఈ 16 రూపాల్లో ఉన్న గణనాథులకు పూజలు చేస్తే మంచి జరుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. పురాణాల్లో పేర్కొన్నట్లు బాలగణపతి, తరుణగణపతి, ఉచ్ఛిష్టగణపతి, విఘ్నగణపతి, మహాగణపతి, క్షిప్రగణపతి, హేరంబగణపతి, లక్ష్మీగణపతి, భక్తిగణపతి, వీరగణపతి, శక్తిగణపతి, ద్విజగణపతి, సిద్ధగణపతి, నృత్యగణపతి, ఊర్ధ్వగణపతి, విజయగణపతి.. ఇలా 16 ప్రధానమైన రూపాలున్నాయి.

ఆర్జీయూకేటీలో ముగిసిన స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం


మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్

బాసర: బాసరలోని ఆర్జీయూకేటీలో ఇంజినీరింగ్‌లో అడుగుపెడుతున్న విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం మంగళవారం ముగిసింది. వారం రోజులుగా కొనసాగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు విద్య, వ్యక్తిత్వ వికాసం, మానవ విలువలు, నిర్ణయాలు తీసుకోవడం, వ్యక్తిగత అభివృద్ధి వంటి విభిన్న అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్, ఓఎస్డీ ప్రొఫెసర్ ఈ.మురళీదర్శన్, స్టూడెంట్ కోఆర్డినేటర్ మహబూబ్, అసోసియేట్ డీన్‌లు చంద్రశేఖర్, మహేశ్, విఠల్, ఇంజినీరింగ్ విభాగాధిపతులు ఉపేందర్, భావ్‌సింగ్ వినయ్, కోఆర్డినేటర్ తేజస్వి, సైదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సొసైటీ సీఈవోల బదిలీ

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పనిచేస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సీఈవోలకు స్థానచలనం కలిగింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 66మంది సీఈవోలు ఉండగా, 49 మందిని వివిధ మండలాలకు బదిలీ చేస్తూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ అడ్డి భోజారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మరో 17 సొసైటీల్లో రెగ్యులర్ సీఈవో లేకపోవడంతో వారికి ఎలాంటి బదిలీ జరగలేదు. వీరికి కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీ చేసినట్లు జిల్లా సహకారశాఖ అధికారి మోహన్ తెలిపారు.

డెంగీతో విద్యార్థి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ
- పాఠశాల ప్రధానోపాధ్యాయుడి సస్పెన్షన్
- ఏఎన్ఎంను విధుల నుంచి తొలగింపు

తిర్యాణి: డెంగీతో ఓ విద్యార్థి మృతి చెందాడు. తల్లిదండ్రులు, ఆర్‌బీఎస్‌కే వైద్యుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పంగిడిమాదర పంచాయతీ పరిధి రాజాగూడ గ్రామానికి చెందిన ఆత్రం సీతారాం–దివ్యజ దంపతులకు ఇద్దరు కుమారులు. మొదటి కుమారుడు ఆత్రం అనురాగ్ (12) స్థానిక ఆశ్రమ పాఠశాలలో ఆరోతరగతి చదువుతున్నాడు. ఈనెల 14న అతడికి జర్వం రావడంతో పాఠశాల నుంచి ఇంటికి వెళ్లాడు. అదేరోజు సాయంత్రం తల్లిదండ్రులు మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో చేర్పించారు. 15న వైద్య సిబ్బంది రక్త పరీక్షలు నిర్వహించగా వ్యాధి నిరార్థణ కాలేదు. అయినప్పటికీ జర్వం తగ్గకపోవడంతో 18న రక్త పరీక్షలు నిర్వహించి తెల్లరక్త కణాలు తగ్గినట్లు గుర్తించారు. 19న మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి డెంగీగా నిర్ధారించారు. ఈనెల 21న బాలుడి పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్స అందిస్తుండగా సోమవారం రాత్రి మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీటీడీవో రమాదేవి, ఎంపీడీవో మల్లేశ్ పరామర్శించారు. కాగా, తిర్యాణి సీహెచ్‌సీలో వైద్య సిబ్బంది వ్యాధి నిర్ధారణలో నిర్లక్ష్యంగా వ్యవహరించి మూడు, నాలుగు రోజులు మామూలు వైద్యం అందించారని తల్లిదండ్రులు ఆరోపించారు. పరిస్థితి విషమించగా మంచిర్యాల ఆస్పత్రికి రిఫర్ చేశారని వాపోయారు. వైద్య సిబ్బంది సరైన చికిత్స అందించి ఉంటే తమ కొడుకు బతికేవాడని ఆవేదన వ్యక్తంజేశారు. కాగా, విద్యార్థికి జర్వం వస్తున్నా ఉన్నతాధికారులకు తెలుపకుండా నిర్లక్ష్యం వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాగర్‌ను సస్పెండ్ చేసినట్లు డీటీడీవో రమాదేవి తెలిపారు. అలాగే విధులను నిర్లక్ష్యం చేసిన ఏఎన్ఎం సువార్తను విధుల నుంచి తొలగించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం పాఠశాల హెచ్‌ఎంగా సీనియర్ ఉపాధ్యాయుడు తిరుపతికి అదనపు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.


ఆత్రం అనురాగ్ (ఫైల్)

మద్యం మత్తులో ఆత్మహత్య

భీమారం: భీమారం గ్రామంలోని ఐటీడీఏ కాలనీకి చెందిన మారం చందు (42) మద్యం మత్తులో గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శ్వేత తెలిపిన వివరాల ప్రకారం.. ఐటీడీఏలో నివాసముంటున్న చందు కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొనేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 25న మద్యం మత్తులో ఇంట్లోనే ఉన్నాడు. ఈ క్రమంలో గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్వేత తెలిపారు. మృతుడికి భార్య సుజాత, కూతుళ్లు శ్రీవల్లి, శ్రీనిక ఉన్నారు.

చెరువులో పడి పశువుల కాపరి మృతి

కుంటాల: మండలంలోని అంబకంటి గ్రామానికి చెందిన పశువుల కాపరి పొన్నవేని భోజన్న (48) కొత్త చెరువులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబకంటి గ్రామానికి చెందిన భోజన్న సోమవారం ఉదయం పశువులను మేపడానికి రోజులాగే గ్రామ శివారుకు వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కొత్త చెరువులో గజ ఈతగాళ్లతో గాలించగా మంగళవారం మృతదేహం లభించింది. మృతుడికి భార్య లక్ష్మి, కూతురు, కుమారుడు ఉన్నారు. లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాత నేరస్తుల బైండోవర్

మంచిర్యాలక్రైం: గతేడాది గణేశ్ నవరాత్రోత్సవాల్లో జిల్లా కేంద్రంలో గొడవలకు పాల్పడిన 13మంది పాత నేరస్తులను మంగళవారం స్థానిక తహసీల్దార్ రఫతుల్లా హుస్సేన్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గతేడాది జరిగిన గణేశ్ నవరాత్రోత్సవాల్లో హింసాత్మక ఘటనలకు ప్రేరేపించిన వారిని, గొడవలకు పాల్పడినవారిని గుర్తించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఎలాంటి నేరాలకు పాల్పడకుండా, శాంతి భద్రతలకు విఘాతం కల్పించకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా వారిని బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. అయినా తీరు మార్చుకోకుండా నేరాలు, హింసాత్మక ఘటనలకు పాల్పడితే రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్సై సత్యద్ధు ఉన్నారు.



నిందితుడి రిమాండ్

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బంగారుగూడ కాలనీలో ఓ వ్యక్తిని బెదిరించి నగదు దొంగిలించిన డీసీ సీటర్ ఖద్దర్‌ను గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బంగారుగూడకు చెందిన ముత్యాలు ఆ ప్రాంతంలో చేపలు విక్రయిస్తున్నాడు. అదే కాలనీకి చెందిన డీసీ సీటర్ ఖద్దర్ ముత్యాలును బెదిరించి రూ.1,500 దొంగిలించి పరారయ్యాడు. అంతేకాకుండా ముత్యాల పక్కనున్న శ్రీనివాస్‌పై దాడి చేశాడు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఖద్దర్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

కలప పట్టివేత


పట్టుకున్న కలపతో అటవీ సిబ్బంది

దండేపల్లి: మండలంలోని నంబాల గోదావరి తీరం వద్ద అక్రమంగా తరలించేందుకు నిల్వ చేసిన 15 టేకు దుంగలను మంగళవారం తమ సిబ్బంది పట్టుకున్నట్లు తాళ్లపేట అటవీ రేంజ్ అధికారి సుష్మారావు తెలిపారు. పట్టుకున్న కలప విలువ రూ.42,329 ఉంటుందని పేర్కొన్నారు. కలపను రేంజ్‌కి తరలించినట్లు తెలిపారు. అటవీ సిబ్బంది ఎఫ్ఎస్‌వో నరేశ్, ఎఫ్‌బీవో నాగరాజుచారి, టైగర్ ట్రాకర్ ప్రశాంత్, బేస్ క్యాంప్ వాచర్ పాల్గొన్నారు.

చోరీకి పాల్పడ్డ నిందితుల అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: చోరీలకు పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 19న తిర్పెల్లిలోని శ్రీనివాస వైన్స్‌లో ఐదుగురు దొంగతనానికి పాల్పడగా అందులో షేక్ బిలాల్, మహ్మద్ షారుఖ్‌ను మంగళవారం అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకోగా, మరొకరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. అలాగే ఈనెల 6న సంజయ్‌నగర్ కాలనీకి చెందిన శానం నవీన్‌కుమార్ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన మహారాష్ట్రకు చెందిన మా రుక్లే అనిల్‌ను మంగళవారం అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. మూడు తులాల బంగారం చోరీకి పాల్పడగా, నిందితుడి నుంచి అర తులం రికవరీ చేసినట్లు సీఐ తెలిపారు.

నవోదయకు 6,091 దరఖాస్తులు

- ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువు నేటితో పూర్తి
- డిసెంబర్ 13న ప్రవేశ పరీక్ష


నవోదయ విద్యాలయం

కాగజ్‌నగర్ టౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయం అన్ని వసతులతో పాటు క్రమ శిక్షణతో కూడిన నాణ్యమైన విద్యకు మారుపేరుగా నిలుస్తోంది. 2026–27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి డిసెంబర్ 13న ఎంట్రెన్స్ పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకు గాను విద్యార్థుల నుంచి ఈ నెల 27 వరకు www. navodaya. gov. in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇప్పటివరకు 6,091 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 3,003 మంది బాలికలు, 3,088 మంది బాలుర దరఖాస్తులున్నాయి. అర్హత పరీక్షలో ప్రతిభ ఆధారంగా నవోదయలో ఆరోతరగతిలో ప్రవేశం కల్పిస్తారు.

దరఖాస్తుల వివరాలు

చెన్నూరు నుంచి 274 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఖానాపూర్ నుంచి 287, మంచిర్యాల నుంచి 510, కాగజ్‌నగర్ నుంచి 631, సిర్పూర్ నుంచి 378, ఆదిలాబాద్ నుంచి 571, బెల్లంపల్లి నుంచి 270, బోథ్ నుంచి 319, నిర్మల్ నుంచి 590, భైంసా నుంచి 664, లక్సెట్టిపేట్ నుంచి 350, మందమర్రి నుంచి 279, ఉట్నూర్ నుంచి 377, ఆసిఫాబాద్ నుంచి 591 వచ్చినట్లు పేర్కొన్నారు.

త్రిభాషా విధానం అమలు

ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఉమ్మడి ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో విద్యార్థులు ఐదో తరగతి చదివి ఉండాలి. వరుసగా 3, 4, 5 తరగతులు ఒకే పాఠశాలలో చదివినవారే అర్హులు. విద్యార్థులు మే 1, 2014 నుంచి జూలై 31, 2016 మధ్యలో జన్మించి ఉండాలి. జవహర్ నవోదయ విద్యాలయంలో త్రిభాషా విధానం ప్రాతిపదికన జాతీయ సమైక్యతకు బాటలు వేస్తోంది. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు సోపానంగా నిలుస్తోంది. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాకులు బాలబాలికలకు వేర్వేరుగా డార్మెటరీలు, టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్‌కు క్వార్టర్లు వంటి వసతులున్నాయి. అంతర్గత సీసీ రోడ్లు, స్ట్రీట్ లైట్లు, ఆరోగ్యాన్ని పంచే హరిత సంపద, సుశిక్షితులైన అధ్యాపకులు, స్మార్ట్ క్లాసులు, సైన్స్, మ్యాథ్స్ ల్యాబ్‌లు, గ్రంథాలయం, ఆటలకు బాసటగా విశాలమైన స్టేడియం, బాస్కెట్‌బాల్ తదితర మైదానాలు జిమ్, హెల్త్‌సెంటర్‌లతో నవోదయ ప్రత్యేకత చాటుతోంది. ఇక్కడ పుస్తకాలు, దుస్తులు సహా విద్యార్థులకు అన్నీ ఉచితమే. 6, 7 తరగతులకు మాతృభాషలో బోధిస్తారు. 8వ తరగతి నుంచి ఆంగ్లంలో విద్యాబోధన చేస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



2026–27 విద్యాసంవత్సరంలో ఆరోతరగతిలో ప్రవేశానికి డిసెంబర్ 13న ప్రవేశ పరీక్ష ఉంటుంది. విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 27 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– రేపాల కృష్ణ, ప్రిన్సిపాల్, కాగజ్‌నగర్ నవోదయ విద్యాలయం

జాప్యం లేకుండా సీఎంపీఎఫ్ సేవలు


మాట్లాడుతున్న రీజినల్ కమిషనర్ గోవర్ధన్

రెబ్బెన: జాప్యం లేకుండా సింగరేణి ఉద్యోగులకు సీఎంపీఎఫ్ సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్–2 గోవర్ధన్ కంటిపుడి తెలిపారు. మంగళవారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రయాస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంపీఎఫ్ లావాదేవీలు అన్ని సీకేర్స్ పోర్టర్ ద్వారా మాత్రమే జరుగుతున్నాయని, సేవలన్నీ పారదర్శకంగా ఉంటాయని పేర్కొన్నారు. ఉద్యోగులు మధ్యవర్తులు లేకుండా సీఎంపీఎఫ్ సేవలను పారదర్శకంగా పొందవచ్చని సూచించారు. సీఎంపీఎఫ్ బెనిఫిట్స్‌కు అర్హులు, పెన్షన్, రివైస్డ్ పెన్షన్‌పై ఎలాంటి పెండింగ్‌లు ఉండకుండా చర్యలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. ఉద్యోగుల సందేహాలకు సమాధానం ఇచ్చారు. పెన్షన్, సీఎంపీఎఫ్ దరఖాస్తులు జీరో పెండింగ్ స్థాయికి తీసుకువచ్చేందుకు ప్రతీ ఉద్యోగి కృషి చేయాలని సూచించారు. ఎస్‌వోటూ జీఎం రాజమల్లు, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్, ప్రశాంత్, సీఎంపీఎఫ్ ఉద్యోగులు మనోహర్, అనిత, అన్ని విభాగాల సంక్షేమ శాఖ క్లరికల్ సిబ్బంది ఉన్నారు.

సింగరేణి బకాయిలు చెల్లించాలి


మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడ్డ డబ్బులను వెంటనే చెల్లించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన శ్రీరాంపూర్‌లోని ఎస్ఆర్పీ–3 గనిలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రూ.27వేల కోట్ల బకాయిలుంటే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.42 వేల కోట్లకు పెరిగిందని తెలిపారు. సమయానికి బకాయిలు చెల్లించకపోవడంతో సంస్థ ఆర్థిక ఇబ్బందులు పడుతోందని పేర్కొన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యంతో సంస్థ పాలన గాడి తప్పుతోందని తెలిపారు. గుర్తింపు సంఘంగా తాము గెలిచిన తర్వాత కార్మికుల ప్రధాన డిమాండ్లను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని పేర్కొన్నారు. గతంలో జరగని స్ట్రక్చరల్ సమావేశాలు నిర్వహించి కార్మికుల డిమాండ్లను పరిష్కరిస్తున్నామని తెలిపారు. కార్మికుల ప్రధాన డిమాండ్ల సాధనకు యాజమాన్యంపై ఒత్తిడి తెస్తూ సాధనకు కృషి చేస్తున్నామని చెప్పారు. కంపెనీ వార్షిక లాభాలను ప్రకటించి అందులో నుంచి 35శాతం వాటా కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీ సైదా, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, జీఎం చర్చల కమిటీ ప్రతినిధులు ప్రసాద్ రెడ్డి, సంపత్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, పిట్ సెక్రటరీ మురళీచౌదరి, ఆకుల లచ్చన్న, జాడి రాజకుమార్, కారుకూరి నగేశ్ తదితరులు పాల్గొన్నారు.